సాక్షి

పశ్చిమగోదావరి

బుధవారం : 5 : ఫిబ్రవరి : 2025



కల్యాణం.. రమణీయం

రథసప్తమి సందర్భంగా తణుకు సూర్యదేవాలయంలో శ్రీ సూర్యభగవానుడి కల్యాణం వేద మంత్రోచ్ఛరణల మధ్య అత్యంత వైభవంగా జరిపించారు. 8లో ▸



అబద్ధాలు చెప్పడం బాబుకు అలవాటే

అబద్ధాలు చెప్పడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని.. మోసపూరిత హామీలు ఇచ్చి అధికార పీఠమెక్కాడని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ధ్వజమెత్తారు. 8లో ▸



కొబ్బరి ధరహాసం

పండుగల ప్రభావంతో కొబ్బరి ధర భారీగా పెరిగింది. ఇటీవల కొబ్బరి దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸

సిట్టింగ్‌లు.. షరామామూలే

- రెండు రోజుల క్రితం భీమవరంలోని వైన్ షాపుల్లో జేసీ తనిఖీలు
- నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుపై ఆగ్రహం
- జేసీ ఆదేశాలు ఖాతరు చేయని లిక్కర్ సిండికేట్
- నేటికీ మద్యం దుకాణాల వద్దే సిట్టింగ్ ఏర్పాట్లు



భీమవరంలోని ఒక మద్యం దుకాణం వద్ద సోమవారం రాత్రి మద్యం సేవిస్తున్న మందుబాబులు

సాక్షి, భీమవరం: జిల్లా కేంద్రం భీమవరంలో లిక్కర్ సిండికేట్ ఇష్టారాజ్యంగా మారింది. జాయింట్ కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. షాపుల వద్దనే మద్యం సేవించేందుకు వీలుగా బార్‌లను తలపించేలా పర్మిట్ తరహా రూమ్‌లను నిర్వహిస్తున్నారు. జిల్లాలో పర్యావరణం, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రతిబంధకంగా ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారు. రోజువారీ పర్యటనల్లో భాగంగా ఎక్కడకు వెళ్లినా నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు చేస్తున్నారు. ఈనెల 1న భీమవరంలోని పలు వైన్‌షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. విజయసాయి వైన్స్, వెంకటేశ్వర వైన్స్, శివ వైన్స్, స్వప్న వైన్స్, సత్య కృష్ణ వైన్స్, అజయ్ వైన్స్ షాపుల్లో నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులు, బాటిల్స్ గుర్తించి ఆయా షాపులకు జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలిచ్చారు.

మారని తీరు : జిల్లాలో 175 మద్యం షాపులు ఉండగా భీమవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 40 వరకు ఉన్నాయి. కూటమి నాయకుల ఆధ్వర్యంలోనే లిక్కర్ సిండికేట్ నడుస్తోంది. ఎక్సైజ్ పాలసీకి విరుద్ధంగా అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించినా సిండికేట్ వర్గాల తీరు మారలేదన్న విమర్శలున్నాయి. పట్టణంలోని పలు మద్యం షాపుల వద్ద సిట్టింగ్ ఏర్పాట్లు ఇంకా కొనసాగుతూనే ఉండటం గమనార్హం. షాపుల వద్ద కూర్చుని తాగేందుకు ప్లాస్టిక్ గ్లాసులకు బదులుగా పేపర్ గ్లాసులు ఇస్తున్నారు. ఉన్నతాధికారులు నివాసముండే జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన ప్రాంతాల్లో మరింత దుర్భరంగా ఉంటాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఎక్సైజ్ అధికారులను సంప్రదించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అడ్డగోలుగా దొరికిన వ్యాపారులు

నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపుల వద్ద లూజ్ సేల్స్ చేయడం, పర్మిట్ రూమ్‌ల మాదిరి అక్కడే తాగేందుకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయడాన్ని జేసీ గుర్తించారు. ఎక్సైజ్ పాలసీకి విరుద్ధంగా షాపుల నిర్వహణ పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా షాపులపై కేసులు బుక్ చేయాలని ఎక్సైజ్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ కేఎస్‌వీ కళ్యాణ్ చక్రవర్తిని ఆదేశించారు. ఇక తరచూ తనిఖీలు ఉంటాయని ఎక్కడ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయకపోయినా, ఎక్సైజ్ పాలసీకి విరుద్ధంగా అమ్మకాలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించి వెళ్లారు. ఈ మేరకు నిషేధిత ప్లాస్టిక్ వినియోగానికి గాను ఒక్కో షాపునకు రూ.4 వేలు వరకు ఫైన్ విధించినట్టు మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయా షాపులపై కేసులు నమోదు చేసినట్టు ఎక్సైజ్ ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు.



భీమవరంలోని మద్యం దుకాణంలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తనిఖీలు (ఫైల్)

గతంలో జనావాసాలకు దూరంగా

మద్యం అమ్మకాలు కట్టడి చేయడమే లక్ష్యంగా గత వైఎస్సార్ సర్కారు ప్రభుత్వ మద్యం పాలసీని అమల్లోకి తెచ్చింది. పర్మిట్ రూమ్‌లను ఎత్తివేసి షాపుల వద్ద కేవలం అమ్మకాలే తప్ప తాగేందుకు వీలులేకుండా చేసింది. బెల్టు షాపులను పూర్తిగా తొలగించింది. షాపుల సంఖ్యను తగ్గిస్తూ వచ్చింది. కాగా రెండునెలల క్రితం వరకు ఊరికి దూరంగా ఎక్కడున్నాయో తెలీని మద్యం షాపులు కూటమి తెచ్చిన ప్రైవేట్ పాలసీతో జనావాసాలు, రద్దీ ఏరియాల్లోకి వచ్చేశాయి. గతంలో షాపు వద్ద మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్లిపోతే ఇప్పుడు దుకాణాల వద్ద చేసిన సిట్టింగ్ ఏర్పాట్లతో పగలు, రాత్రి తేడా లేకుండా మందుబాబులు అక్కడే కూర్చుని మద్యం మత్తులో జోగుతున్నారు. గ్రామగ్రామాన బెల్టుషాపులకు కొదవే లేదు. చాలాచోట్ల కిల్లీ బడ్డీలు, చిన్నచిన్న దుకాణాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అడపాదడపా కేసులు నమోదుచేసి చేతులు దులుపుకుంటున్నారు. బెల్టులు ఏర్పాటుచేస్తే రూ. 5 లక్షలు ఫైన్, రెండవ సారి దొరికితే లైసెన్సు రద్దు హెచ్చరికలు షరామామూలేనన్న ధోరణిలో సిండికేట్ వర్గాలున్నాయి.

కోళ్ల ఫారాల వద్ద బయోసెక్యూరిటీ పాటించాలి

జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ కె. మురళీకృష్ణ



తణుకులో మాట్లాడుతున్న మురళీకృష్ణ, వైద్యులు

తణుకు అర్బన్: కోళ్ల ఫారాల వద్ద పూర్తిస్థాయి జీవ సంరక్షణ చర్యలు (బయోసెక్యూరిటీ) పాటించడం ద్వారా కోళ్లలో వ్యాధులను అదుపు చేయవచ్చని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం తణుకు బీవీ రావు కల్యాణ మండపంలోని నెక్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటం, మంచు ఎక్కువగా ఉండటం వలన దేశవాళీ, ఫారం కోళ్లలో వ్యాధి నిరోధక శక్తి క్షీణించి మిక్స్‌డ్ వైరల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్పష్టం చేశారు. వ్యాధి నిర్ధారణకు నమూనాలను నిర్దేశించిన ప్రయోగశాలలకు పంపడం జరిగిందని, త్వరలో వాటి ఫలితాలు వెలువడతాయని, అప్పటివరకు రైతులు బయో సెక్యూరిటీ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చనిపోయిన కోళ్లను గుంట తీసి సున్నంతో కలిపి పూడ్చిపెట్టాలన్నారు. కోళ్ల ఆరోగ్యం కాపాడడం కోసం వ్యాక్సినేషన్, క్రిమిసంహారక మందులు స్ప్రే చేయడం, తాగునీటిలో మందులు వాడడం వలన వ్యాధి అదుపులోకి వస్తుందని తెలిపారు. ఈ వ్యాధి మనుషులకు సోకే అవకాశం లేదని, ప్రజలు నిర్భయంగా కోడిగుడ్లు, కోడి మాంసం వినియోగించవచ్చని స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెం పశుసంవర్థక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎల్‌కే సుధాకర్, తణుకు ఉపసంచాలకులు డాక్టర్ వాకాని ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దోమల నివారణకు చర్యలు



తణుకు సజ్జాపురంలో డ్రైయినేజీల్లో మలాథియాన్ స్ప్రే చేస్తున్న కార్మికుడు

సాక్షి స్పందన

తణుకు అర్బన్: తణుకు సజ్జాపురంలో దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. దోమల విజృంభణ కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'దోమలు బాబోయ్ దోమలు' శీర్షికన సాక్షి మంగళవారం కథనాన్ని ప్రచురించింది. దీంతో మునిసిపల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. దోమల నివారణకు డ్రైయినేజీల్లో మలాథియాన్ స్ప్రేయింగ్ చేయడంతోపాటు విస్తృతంగా ఫాగింగ్ చేశారు. కమిషనర్ టి.రామ్‌కుమార్ ప్రత్యేకంగా వార్డుల్లో పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ చేయడంతోపాటు శానిటేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు.

6న పీడీఎస్ రైస్ బహిరంగ వేలం

భీమవరం: జిల్లాలో నిల్వ ఉన్న పీడీఎస్ రైస్‌ను ఈనెల 6వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ 6ఏ కేసుల్లో సీజ్ చేసిన 48.330 మెట్రిక్ టన్నుల ప్రజా పంపిణీ బియ్యాన్ని ఉండి ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో నిల్వ చేశామన్నారు. విచారణానంతరం సీజ్ చేసిన బియ్యాన్ని కిలో రూ.20 ధర నిర్ణయించి బహిరంగ వేలం ద్వారా విక్రయానికి పెట్టినట్లు చెప్పారు. గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని, ఆసక్తి కలిగిన వ్యాపారస్తులు జీఎస్టీ లైసెన్స్ కలిగి ముందుగా రూ.5 వేలు ధరావత్తు సొమ్మును చెల్లించి పాటలో పాల్గొనాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి కోరారు.

ఏడు నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధి



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

భీమవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలోనే రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వాటిని ఓటర్లకు వివరించి ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి కృషి చేయాలని ఆయన కేడర్‌కి సూచించారు. స్థానిక విష్ణు కళాశాలలో ఏర్పాటుచేసిన కూటమి నేతల సమన్వయక మిటీ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పెద్ద సంఖ్యలో పింఛన్లు ఇస్తున్నామని గొట్టిపాటి చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, బొమ్మిడినాయకర్, కూటమి నేతలు పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోమ్‌కు చిన్నారులు



మాట్లాడుతున్న ఆర్డీవో ఎంవీ రమణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో తల్లి, ఆమె ప్రియుడు పైశాచికత్వంతో తీవ్రంగా బాధపడిన చిన్నారుల భద్రత దృష్ట్యా వారిని ఏలూరులోని చిల్డ్రన్ హోమ్‌కు తరలిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ చిన్నారులు ఉదయ్ రాహుల్, రేణుకలకు ప్రస్తుతం ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నామన్నారు. వారిని మూడు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని ఆసుపత్రి వైద్యులు తెలియజేశారన్నారు. అనంతరం వారిని ఏలూరులోని చిల్డ్రన్ హోమ్‌కు తరలించేందుకు కలెక్టర్ ఆదేశించారన్నారు. అలాగే చిన్నారుల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన జాయింట్ అకౌంట్ కొనసాగుతుందని ఆర్డీవో తెలిపారు. దాతలు ఇచ్చిన సొమ్మును అందులో జమ చేసి వారు మేజర్లు అయిన తరువాత వారి భవిష్యత్తు అవసరాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. దాతలు ఎవరైనా సహాయం చేయదలిస్తే జంగారెడ్డిగూడెం అశ్వారావుపేట రోడ్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్‌కు ఖాతా నంబరు 025912010003035 (ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0802590)కు జమచేయాలని కోరారు.

సూర్యనమస్కారాలతో ఆరోగ్యం



భీమవరంలో సూర్యనమస్కార పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం: ప్రతి నిత్యం సూర్యనమస్కారాలను ఆచరిస్తే విద్యార్థుల్లో ఆరోగ్యంతోపాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని సంస్కార భారతి కన్వీనర్ చెట్లపల్లి జగన్మోహన్ అన్నారు. రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం డీఎన్నార్ కళాశాల ఆవరణలో పాఠశాల విద్యార్థులకు సూర్యనమస్కార పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దాట్ల లక్ష్మీపతిరాజు, గూడూరి సాంబమూర్తి, హరికృష్ణ, మజ్జి మహేష్, గొంతెన శ్రీనివాస్, రావూరి అనంత్ పాల్గొన్నారు.

అధినేతను కలిసిన నాయకులు





తాడేపల్లిలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసిన ఉమాబాల, కారుమూరి, డీఎన్నార్, జేపీ, బాబ్జి

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. లండన్ పర్యటన అనంతరం వైఎస్ జగన్ తాడేపల్లి నివాసానికి సోమవారం రాత్రి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ నాయకురాలు గూడూరి ఉమాబాల, ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, రాష్ట్ర మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఏలూరు సమన్వయ కర్త మామిళ్లపల్లి జయప్రకాష్ తదితరులు పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసి పశ్చిమ, ఏలూరు జిల్లాలో రాజకీయ పరిణామాలపై ఆయనకు వివరించారు. పార్టీ బలోపేతానికి క్షేత్ర స్థాయిలో నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వారి పక్షాన నిలబడి పోరాటం చేయాలని చెప్పారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తామన్నారు. ఆయన్ను కలిసిన వారిలో జంగారెడ్డిగూడెంకు చెందిన జెడ్పీటీసీ పొల్నాటి బాబ్జీ ఉన్నారు.

సమన్వయంతో లక్ష్యాలు సాధించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా అన్ని మండలాల్లోని అధికారులతో సమీక్షించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి, జాతీయ ఉపాధి హామీ పనులు, అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నపిల్లల ఆధారు నమోదు, రెవెన్యూ సదస్సులు, తదితర 10 అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రాడ్యుయేటు ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రైవేటు ప్రాంతాల్లో రాజకీయ పార్టీలు, నేతలకు సంబంధించిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, గోడరాతలను పూర్తిస్థాయిలో తొలగించాలన్నారు. ఎటువంటి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు జరుపకూడదని, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహణకు అలాగే లౌడ్ స్పీకర్లకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలు టాయిలెట్లు తదితర వాటిని ఫొటోలు తీసి యాప్‌లో పొందుపరచాలన్నారు. ప్రతి కుటుంబానికి జియో టాగింగ్ చేయాలని ఏపీలో నివాసం ఉంటున్న వారిని, వేరే రాష్ట్రంలో ఉన్న వారిని గుర్తించాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పనులు రోజువారీ వేతనదారుల హాజరును యాప్‌లో పొందుపరచాలన్నారు. ప్రతిచోట పనులు జరుగుతూ ఉండాలని, పనులు కల్పించలేదని ఒక్క ఫిర్యాదు రాకుండా చూడాలన్నారు.

'పట్టభద్రుల' ఎన్నికలకు ఒక నామినేషన్ దాఖలు



నామినేషన్‌ను స్వీకరిస్తున్న ఆర్‌వో వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మంగళవారం ఏలూరుకు చెందిన ములకల శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటరిన్గ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి ములకల శ్రీనివాస్ నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. అభ్యర్థి ములకల శ్రీనివాస్‌తో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నెలల తరబడి పస్తులే..!

- ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనాన్ని విడుదల చేయాని కూటమి ప్రభుత్వం
- ఎన్నికలకు ముందు రూ.5 వేలు చొప్పున పెంచుతామన్న చంద్రబాబు
- పెంచడం అటుంచి ఉన్నదీ ఇవ్వలేదు
- ఉమ్మడి జిల్లాలో 206 మసీదుల్లో ప్రార్థనలు ప్రశ్నార్థకం



నగరంలోని తంగెళ్ళమూడి నెహర్ మజీదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరిలో వందలాది మసీదులు ఉండగా వాటిలో కొన్ని ఆదాయ వనరులు లేక ప్రార్థనలు నిర్వహించే పరిస్థితికి సైతం దూరమయ్యాయి. ఇటువంటి పరిస్థితిని అధిగమించడానికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదాయ వనరులు లేని మసీదులకు సంబంధించి ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతన పథకాన్ని ప్రారంభించి నిరంతరాయంగా వారికి ప్రతి నెలా గౌరవ వేతనాన్ని అందించి ప్రోత్సహించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఇమామ్‌లు, మౌజన్‌లకు ప్రభుత్వం ఇవ్వాల్సిన గౌరవ వేతనాన్ని ఇవ్వకుండా వారి కుటుంబాలను పస్తులు పెడుతోంది.

అమలుకు నోచుకోని చంద్రబాబు హామీ

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన చంద్రబాబు అనేక ఎన్నికల సభల్లో మాట్లాడుతూ ముఖ్యంగా ముస్లింల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇమామ్‌లకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేలకు అదనంగా మరో రూ.5 వేలు కలిపి మొత్తం రూ.15 వేలు అందిస్తామని ప్రకటించారు. మౌజన్‌లకు గత ప్రభుత్వం అందించిన రూ.5 వేలకు మరో రూ.5 వేలు కలిపి నెలకు రూ.10 వేలు తమ ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో తమ ఓట్లతో గెలిచిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తమకు గౌరవ వేతనాన్ని పెంచి ఇస్తుందని ఎంతో ఆశగా చూసిన ఇమామ్, మౌజన్‌ల కుటుంబాలకు బాబు చేతిలో తాము మరోసారి మోసపోయామని గుర్తించడానికి ఎంతోకాలం పట్ట లేదు. ప్రతి నెలా గౌరవ వేతనం విడుదలౌతుందని ఎదురు చూడడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నామని, కుటుంబాలు గడుపుకోవడానికి అప్పులు చేసే దౌర్భాగ్య స్థితికి కూటమి ప్రభుత్వం తమను తీసుకువచ్చిందని ఇమామ్, మౌజన్‌ల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం బకాయి రూ.6.18 కోట్లు

ఎన్నికల కోడ్ అమలు కారణంగా నిలిచిపోయిన రెండు నెలల బకాయిలతో పాటు కూటమి ప్రభుత్వం అధికార బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి దాదాపుగా ఏడాదికి సంబంధించిన గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. అంటే ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలోని ఎంపిక చేసిన 206 మసీదుల్లో పని చేసే ఇమామ్‌లకు సుమారుగా 12 నెలల బకాయిల మొత్తం రూ.3.70 కోట్లు, మౌజన్‌లకు 12 నెలల బకాయిల మొత్తం రూ.2.47 కోట్లు వెరసి మొత్తం రూ.6.18 కోట్ల మొత్తం గౌరవ వేతనం కూటమి ప్రభుత్వం బకాయి పడింది.

నమాజు ప్రార్థనలు ప్రశ్నార్థకం



చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం పెంచి వెంటనే విడుదల చేయాలి. గత 10 నెలలుగా వారికి గౌరవ వేతనం విడుదల చేయకపోవడంతో వారి కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయి. కొన్ని కుటుంబాలు అప్పులు చేసి బతుకుతున్నాయి. ఈ కారణంగా మసీదుల్లో నమాజు ప్రార్థనలు ప్రశ్నార్థకంగా మారాయి.

– మొహమ్మద్ ఇస్మాయిల్ షరీఫ్, అధ్యక్షుడు, మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ

ప్రతిపాదనలు పంపాం



ఇమామ్‌లు, మౌజన్‌ల గౌరవ వేతనాలు ఎప్పుడు విడుదల చేస్తారో సమాచారం లేదు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు నేరుగా మసీదుల ఖాతాల్లోకే జమ అవుతాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 206 మసీదుల్లో పని చేసే ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం అమలు జరుగుతోంది. కొత్తగా మరో 50 మసీదుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

– కేఎండీ అలీమ్, వక్ఫ్ బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్

జగన్ ప్రభుత్వంలో అందించిన గౌరవ వేతనం

జగన్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో అసలు ఆదాయం లేని 206 మసీదులను గుర్తించారు. ఆ మసీదుల్లో పని చేసే ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం మేరకు ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.5 వేలు ప్రతి నెలా ఇవ్వాలని జీఓ విడుదల చేశారు. దాని ప్రకారం అప్పటి నుంచి ఆయా మసీదుల్లో పని చేసే ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాన్ని ప్రభుత్వం అందిస్తూ వస్తోంది. వీరికి ప్రభుత్వం అందించే గౌరవ వేతనం గత ఏడాది ఫిబ్రవరి వరకు మాత్రమే అందింది. అనంతరం ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మార్చి నెల నుంచి ప్రభుత్వం నుంచి వీరికి ఎటువంటి వేతనం అందడం లేదు. ఎన్నికల కోడ్‌లో భాగంగా నిలిచిపోయిన గౌరవ వేతనం ఎన్నికల అనంతరం కొత్తగా బాధ్యతలు చేపట్టిన ప్రభుత్వం విడుదల చేస్తుందని ఇమామ్, మౌజన్‌ల కుటుంబాలు భావించాయి.

క్లుప్తంగా

టిష్యూ ఇంజనీరింగ్ పాత్ర కీలకం


చేతన్ గౌడ్

తాడేపల్లిగూడెం: ఆధునిక చికిత్సా విధానంలో టిష్యూ ఇంజనీరింగ్ పాత్ర కీలకమని సైటో ల్యాబ్ సహ వ్యవస్థాపకుడు చేతన్‌గౌడ్ అన్నారు. ఏపీ నిట్‌లో మంగళవారం బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో బయోప్రింటింగ్ అండ్ టిష్యూ ఇంజనీరింగ్ అనే అంశంపై విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా చేతన్‌గౌడ్, సైటో ల్యాబ్ బయో ఇంజనీర్ రోహన్ వ్యాస్ ఆన్‌లైన్‌లో పలు విషయాల గురించి వివరించారు. శరీరంలో దెబ్బతిన్న జీవకణజాల పనితీరును పునరుద్ధరించడానికి, వాటి ఉత్పత్తిని మెరుగుపర్చడానికి టిష్యూ ఇంజనీరింగ్ పద్ధతి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. టిష్యూ ఇంజనీరింగ్ ప్రాధాన్యత, పరిశోధనలు వంటి విషయాలకు సంబంధించి విద్యార్థుల అనుమానాలనునివృత్తి చేశారు. బయోటెక్నాలజీ విభాగాధిపతి వి.సుదర్శనదీప అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్యులు శారదా ప్రసన్న మాలిక్, డాక్టర్ జగన్ మోహన్‌రావు, వి.వందనకుమారి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ


అవార్డు తీసుకుంటున్న దుర్గరావు

భీమవరం అర్బన్ : రాజస్థాన్‌లో ఇటీవల నిర్వహించిన ఎస్‌బీకేఎఫ్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో భీమవరం మండలంలోని గూట్లపాడు గ్రామానికి చెందిన రామాయణం దుర్గారావు డబుల్స్ విభాగంలో స్వర్ణం, సింగిల్స్ విభాగంలో కాంస్య పథకం కైవసం చేసుకున్నాడు. మంగళవారం దుర్గారావు గుజరాత్ నుంచి సొంతూరు గూట్లపాడు గ్రామానికి రావడంతో గ్రామస్తులు అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా దుర్గరావు మాట్లా డుతూ తన తండ్రి పల్లారావు, తల్లి సాయిలక్ష్మి ప్రోత్సాహంతోనే జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపినట్లు వివరించారు.

ఆరు సెల్‌ఫోన్ షాపులపై కేసుల నమోదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నిబంధనలకు విరుద్ధంగా సెల్‌ఫోన్లు, రకరకాల లైట్లు, సౌండ్ బాక్సులు, స్పీకర్లు విక్రయిస్తున్న ఆరు సెల్‌ఫోన్ షాపులపై తూనికలు, కొలతల చట్ట ప్రకారం 12 కేసులు నమోదు చేసినట్లు రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఏలూరు, పాలకొల్లు పట్టణాలలో విజిలెన్స్, తూనికలు కొలతల అధికారులు సంయుక్తంగా మొబైల్ ఫోన్ల షాపుల్లో తనిఖీ చేశారన్నారు. నగరంలోని సెల్ టెక్ మొబైల్ షాప్, హిందూస్తాన్ మొబైల్స్, భారత్ టెలికం మొబైల్స్, పాలకొల్లు పట్టణంలో పూజ మొబైల్స్ అండ్ స్పేర్ పార్ట్స్, రాందేవ్ మొబైల్స్, శ్రీ మొబైల్స్ షాపుల్లో నిబంధనలు ప్రకారం లేని ఉత్పత్తులను గుర్తించారు. ఈ దాడుల్లో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్లు పి.శివరామ కృష్ణ, డి.ప్రసాద్ కుమార్, తూనికలు కొలతల శాఖ అధికారి వి.ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

కమనీయం.. రమణీయం

వైభవంగా సూర్య భగవానుడి కల్యాణం

తణుకు అర్బన్: రథసప్తమి సందర్భంగా తణుకు సూర్యదేవాలయంలోని శ్రీసూర్యభగవానుడి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీవైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం మంగళవారం ఉదయం 11.30 గంటల ముహూర్తానికి ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ సమేతుడైన శ్రీ సూర్యభగవానుడి కల్యాణ ఘట్టం భక్తుల సమక్షంలో వేదపండితుల వేద మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా జరిపించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వాహనంలో పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగించారు. సాయంత్రం స్వామివారిక శ్రీపుష్పయాగోత్సవం శాస్త్రోక్తంగా జరిపించారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు...

రాష్ట్రంలోనే అరసవల్లి తరువాత రెండో సూర్యదేవాలయం కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామివారి దర్శనం, కల్యాణ వేడుకను చూసేందుకు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ముఖ్యంగా సూర్యాలయం వీధి, పిండిమర్లవీధి, బాబు వారి వీధి, రాష్ట్రపతి రోడ్డు కిటకిటలాడాయి. అధికసంఖ్యలో భక్తులు తరలిరావడంతో సూర్యాలయం వీధితోపాటు రాష్ట్రపతి రోడ్డు బాయ్స్ హైస్కూలు ప్రాంతం వరకు క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. భక్తుల తాకిడి నేపథ్యంలో ఉదయం 5 గంటల నుంచి స్వామి వారి దర్శనాన్ని ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో వేలాది మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఈఓ ముత్యాల సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భారీగా భక్తులు తరలిరావడంతో పోలీసులు క్యూలైన్ల వద్ద బందోబస్తు నిర్వహించారు.


విశేషాలంకరణలో సూర్యభగవానుడు


తణుకులో సూర్యనారాయణ స్వామి కల్యాణ తంతు నిర్వహిస్తున్న దృశ్యం


తణుకు రాష్ట్రపతి రోడ్డులో సూర్య భగవానుడి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

శ్రీవారి క్షేత్రంలో ఘనంగా రథసప్తమి వేడుకలు


సూర్యప్రభ వాహనంలో తిరువీధి సేవకు పయినమవుతున్న శ్రీ వారు

ద్వారకాతిరుమల: చిన్నతిరుపతిగా పేరొందిన ద్వారకాతిరుమల దివ్య క్షేత్రంలో రథసప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీవారు ఉదయం సూర్య ప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహనాలపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తకోటికి దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను సూర్యప్రభ వాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆ తరువాత విశేష పూజాధికాలు నిర్వహించి, హారతులిచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ స్వామివారి వాహనం ప్రధాన రాజగోపురం మీదుగా తిరువీధులకు పయనమైంది. అశ్వ, గజ సేవలు, కోలాట నృత్యాల నడుమ తిరువీధుల్లో సూర్య ప్రభ వాహనంపై దేదీప్యమానంగా వెలుగొందిన స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. అలాగే రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ క్షేత్రంలో నేత్రపర్వంగా సాగింది.

అబద్ధాలు చెప్పడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య

మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఎద్దేవా


ఏలూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

ఏలూరు (టూటౌన్) : అబద్ధాలు చెప్పడం చంద్రబాబు నాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అంటూ మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ధ్వజమెత్తారు. ఏలూరులోని లేడీస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సూపర్ సిక్స్ అంటూ మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి హామీలన్నింటినీ తుంగలోకి తొక్కిందంటూ విమర్శించారు. ఇటీవల ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారంలోనూ ఎన్డీఏ కూటమిలో భాగంగా తమ రాష్ట్రానికి కేంద్రం పెద్ద ఎత్తున నిధులు వరద పారిస్తుందంటూ దీని వల్ల రాష్ట్ర అభివృద్ధి పథంలో దూసుకు పోతుందంటూ అక్కడి ప్రజలకు చెప్పడం సిగ్గుచేటన్నారు. మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారం దక్కించుకున్న మహా నాయకుడు చంద్రబాబు నాయుడు అంటూ ఎద్దేవా చేశారు. శాసనమండలిలో సామాన్యుడి గొంతు వినిపించాలనే ఉద్దేశంతో తన కుమారుడు జీవీ సుందర్‌ను ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దింపినట్లు ఆయన చెప్పారు. తన కుమారుడిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిరుద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే రాష్ట్ర శాసన మండలిలో నిరుద్యోగుల సమస్యలపరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్ అన్నారు. ఏడాదికి ఒకసారి జాబ్ మేళాను నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు సకాలంలో అందించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో పలువురు ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ జాతర నిర్వహణపై సమీక్ష


సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ అచ్యుత అంబరీష్

కైకలూరు : రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరను అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతగా పూర్తి చేయాలని జాతర కమిటీ చైర్మన్, ఏలూరు ఆర్డీఓ డాక్టర్ ఎం.అచ్యుత అంబరీష్ సూచించారు. మార్చి 1 నుంచి 13వరకు జరుగు కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర(తీర్థం) నేపథ్యంలో ముందస్తు సమన్వయ సమావేశం కైకలూరు తహసీల్దారు కార్యాలయంలో ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మాట్లాడుతూ జాతర సమయంలో తాగునీరు, విద్యుత్, రహదారుల ఏర్పాటు, చలువ పందిళ్లు, భక్తులు బట్టలు మార్చుకునే తాత్కాలిక గదులు, పారిశుద్ధ్య కార్మికులు, వైద్య సేవలు, అగ్నిమాపక సిబ్బంది పర్యవేక్షణ, ఆర్టీసీ బస్సులు ఏర్పాటు వంటి అంశాలపై శాఖల వారిగా చర్చించారు. ముఖ్యంగా అమ్మవారి దేవస్థానం చేరడానికి సర్కారు కాల్వపై సిమెంటు వంతెన వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. దుకాణదారులు అధికాంగా గ్యాస్ సిలిండర్లను డంప్‌గా నిల్వ ఉంచితే సీజ్ చేయాలని ఫైర్ డిపార్టుమెంట్ అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం ఆర్డీవో సర్కారు కాల్వ వంతెన పరిశీలించి, పెద్దింట్లమ్మను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా దేవదాయశాఖ అధికారి సీహెచ్ రంగారావు, ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం, ఎంపీడీఓ ఆర్.ఫణింద్ర, డీఈ రామకృష్ణ, రూరల్ ఎస్సై వి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి ధరహాసం

- ఊపందుకున్న ఎగుమతులు
- ఆశాజనకంగా దిగుబడులు
- వెయ్యి కాయలు రూ.12 వేలకు కొనుగోలు


కొబ్బరి ఎగుమతికి ఒలుపు పనులు చేస్తున్న కార్మికుడు

భీమవరం: పండుగల ప్రభావంతో కొబ్బరి ధర భారీగా పెరిగింది. అలాగే ఇటీవల కాలంలో కొబ్బరి దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్తీకమాసం నుంచి కొబ్బరి ధరలు పెరుగుతూ ప్రస్తుతం రైతుల నుంచి వెయ్యి కొబ్బరికాయలను రూ.12 వేల వరకు కొనుగోలు చేయడంతో పాటు దిగుబడి కూడా ఎకరాకు మూడు వేల కాయల వరకు వస్తుండడంతో రైతులు కొబ్బరిపై ఆసక్తి చూపుతున్నారు. గత మేలో కొబ్బరి ధర వెయ్యి కాయలు రూ.7 వేలు మించకపోవడం, దిగుబడి కూడా తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దింపు, ఒలుపు, కూలీల ఖర్చులు పెరగడంతో కొబ్బరి దింపు తీయించడానికి కూడా వెనుకాడారు. అలాగే వ్యాపారులు కూడా నిల్వ చేసే పరిస్థితి లేకుండా తక్కువ ధరకైనా ఎప్పటికప్పుడు అమ్మకాలు సాగించేవారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 25 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు చేయడంతోపాటు అనేక మంది రైతులు పెరటిదొడ్లు, పుంతగట్లు, రోడ్ల వెంబడి కొబ్బరి చెట్లు పెంచుతున్నారు.

ప్రతి రోజూ 50 లారీలతో ఎగుమతులు

జిల్లాలోని కొబ్బరి ఎగుమతులకు ప్రధాన కేంద్రమైన పాలకొల్లు నుంచి ప్రతి రోజూ 35 లారీల కొబ్బరికాయలు ఎగుమతి అవుతుండగా మిలిగిన ప్రాంతాల నుంచి సుమారు 15 లారీల కాయలు ఎగుమతి అవుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం పచ్చి కొబ్బరి గుజరాత్, మహారాష్ట్ర, ఛతీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, కర్నాటక తదితర రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. గతేడాది తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కొబ్బరి ఎక్కువగా దిగుబడి రావడంత కాయ సైజులో కూడా పెద్దదిగా ఉండడంతో అక్కడ కొబ్బరికి గిరాకీ పెరిగి మన కొబ్బరికి ధరలు తగ్గాయి. ప్రస్తుతం తమిళనాడులో కొబ్బరి దిగుబడి తగ్గడంతో ఇక్కడ కొబ్బరికి గిరాకీ పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ధరలు నిలకడగా ఉండేలా చర్యలు తీసుకోవాలి



ఇటీవల కొబ్బరి ధరలు కొంత మేరకు ఆశాజనకంగా ఉన్నా నిలకడగా ఉండవు. ప్రస్తుతం రైతుల నుంచి వెయ్యికాయలు రూ. 11 వేలకు కొనుగోలు చేస్తున్నాం. దీనికి ఒలుపు, ఇతర ఖర్చులు వెయ్యి కాయలకు రూ. 3 వేలుపైగా పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. అయితే ధరలు ఎప్పుడు ఎలా ఉంటున్నాయో? తెలియక నిల్వలు వేయడానికి భయపడుతున్నాం. కొబ్బరి ధరల్లో నిలకడగా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గంధం త్రిమూర్తులు, కొబ్బరి వ్యాపారి, మేడపాడు

దిగుబడులు పెరిగాయి



వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఇటీవల కొబ్బరి దిగుబడులు పెరిగాయి. గతేడాదితో పోలిస్తే మంచి దిగుబడులే ఉన్నాయి. అయితే కొబ్బరికి సరైన మోతాదులో పోషకాలు అందిస్తే నిత్యం దిగుబడి తగ్గకుండా ఉంటుంది. ఏడాదిలో మూడు పర్యాయాలు ఎరువును అందించాలి. ప్రస్తుతం కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందపడుతున్నారు.

– సీహెచ్ శ్రీనివాస్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, భీమవరం

కొల్లేరు అంశంపై సుప్రీం కోర్టులో కౌంటర్ పిటిషన్‌కు సిద్ధం

కైకలూరు : కొల్లేరు ఆక్రమణలపై సుప్రీం కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో కౌంటర్ పిటిషన్ వేయాలని కొల్లేరు నాయకులు మంగళవా ఢిల్లీలో ప్రముఖ న్యాయవాది జి.నాగేశ్వరరెడ్డిని కోరారు. ఇటీవల కొల్లేరు ఆక్రమణలు తొలగించి సరిహద్దులను మూడు నెలల్లో ఏర్పాటు చేసి కోర్టుకు సమర్పించాలని కాకినాడకు చెందిన మృత్యుంజయరావు పిటిషన్‌పై ఏపీ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ మార్చి నెలకు వాయిదా వేసింది. దీంతో ఖంగుతిన్న కూటమి నేతలు కైకలూరులో గత నెలలో కొల్లేరు పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో కొల్లేరు నాయకులు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలిసి ఢిల్లీలోని న్యాయవాది జి.నాగేశ్వరరెడ్డిని కలిసి వారి వద్ద ఉన్న వివరాలు అందించారు. మరో రెండు రోజులు ఢిల్లీలో ఉంటూ కేంద్ర మంత్రులు, అధికారులను కలిసి వినతిపత్రాలు అందించాలని నిర్ణయించారు. ఢిల్లీ వెళ్లిన వారిలో బలే ఏసురాజు, ఘంటసాల మహాలక్ష్మరాజు, సైదు సత్యనారాయణ, బీకేఎం నాని తదితరులు ఉన్నారు.

7న మార్టేరులో క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఈవెంట్

పెనుమంట్ర: మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈనెల 7న వ్యవసాయ విద్యలో డిగ్రీ లేదా డిప్లమో కోర్సులు చేసిన విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన డింబుల్ అగ్రిసైన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ద్వారా మార్టేరులో ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన వారికి సంవత్సరానికి రూ. 1.8 లక్షలు నుంచి రూ. 2 లక్షల వరకు వేతనం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 7న ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్‌లతో మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం వద్దకు రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 83749 34362 నంబర్‌ను ఫోన్ చేయాలని సూచించారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

నరసాపురం: పట్టణంలోని శ్రీహరిపేట సమీపంలో నరసాపురం-నిడదవోలు ప్రధాన పంట కాలువలో పడి అదే ప్రాంతానికి చెందిన పున్నాని రమేష్(45) మృతి చెందాడు. దీనికి సంబంధించి టౌన్ ఎస్సై సీహెచ్ విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం రమేష్ మద్యానికి బానిసై శ్రీహరిపేటలో తల్లితో పాటు నివసిస్తున్నాడు. సోమవారం పనికి అని వెళ్లి తిరిగిరాలేదు. అయితే కాలువ వద్ద రాత్రి వరకూ తిరుగుతూ కనిపించినట్టుగా సమాచారం ఉండడంతో మంగళవారం ఉదయం కాలువలో గాలించగా మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై వివరించారు.

ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో పనిచేస్తున్న లెక్చరర్లు, టీచర్లు, బోధనేతర సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరినట్టు ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దిద్దే అంబేడ్కర్ తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో సమస్యల పరిష్కారం నిమిత్తం లోకేష్ ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ఆహ్వానం మేరకు సోమవారం హాజరైన తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఏలూరులో విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. చట్ట ప్రకారం ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించి వారికి అందాల్సిన కనీస హక్కులను యాజమాన్యాల నుంచి కల్పించే విధంగా విద్యాశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరామని వివరించారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

భీమవరం: స్థానిక గునుపూడి గరువుపేటకు చెందిన ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్సై బీవై కిరణ్‌కుమార్ మంగళవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గరువుపేటకు చెందిన బత్తిన రాజు కుమార్తె అనూష (19) పట్టణంలోని గునుపూడికి చెందిన ఎం.సత్యనారాయణ ప్రేమించుకుంటున్నారు. ఈ నెల 3న రాత్రి అనూష తన ప్రియుడితో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం అనూష గదిలోకి వెళ్లింది. తర్వాత సత్యనారాయణ అనూష సోదరి బత్తిన కృష్ణవేణికి ఫోన్ చేసి మీ చెల్లి చనిపోయినట్లుగా ఉంది గదిలోనికి వెళ్లి చూడమనడంతో కృష్ణవేణి మేనమామ సాయిబాబు వచ్చి గునపంతో తలుపు పగలుగొట్టి చూడగా చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉంది. వెంటనే అనూషను కిందకు దింపి చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయింది. ఈ మేరకు మృతురాలి సోదరి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బైక్ చోరీపై కేసు

అత్తిలి: పార్కు చేసిన బైక్‌ను దొంగిలించిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.ప్రేమరాజు మంగళవారం చెప్పారు. ఈ నెల 1న గణపవరం మండలం ఎస్.కొండేపాడు గ్రామానికి చెందిన శీలబోయిన సాయిమాధవ్ తన ఏపీ 39 డీఎక్స్ 8299 నంబర్ బ్లాక్ కలర్ యూనికార్న్ బైక్‌ను అత్తిలి వచ్చి ఆర్చి వద్ద పార్కు చేశాడు. అనంతరం పని ముగించుకునే వచ్చేసరికి తన బైక్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెతికిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

సచివాలయాలకు చంద్ర గ్రహణం!

- కళను కోల్పోతున్న సచివాలయాలు
- గతంతో పోలిస్తే 75శాతం సేవలు కట్
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజానీకం



సచివాలయ భవనం



లబ్ధిదారునికి సేవలందిస్తున్న ప్రత్తిపాడు వలంటీర్ (ఫైల్)

పెంటపాడు: గతంలో గ్రామీణులు ఏ చిన్న పని ఉన్నా వేకువజామునే లేచి మండల కేంద్రానికో, జిల్లా కేంద్రానికో బయలుదేరేందుకు సిద్ధపడాల్సి వచ్చేది. దీంతో ఉదయంపూట చేసుకునే వ్యవసాయ పనులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. పైగా సదరు సమస్యపై రోజుల కొలది కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు అయ్యేవికావు. ఇది గ్రహించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం తీసుకురావాలనే బృహత్ సంకల్పంతో పంచాయతీ కేంద్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి రైతులు, గ్రామీణులకు సమస్యల పరిష్కార వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి, ప్రజలకు 139రకాల సేవలను అందజేసేవారు. ప్రతిరోజూ గ్రీవెన్స్ ఏర్పాటు చేసి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపేవారు. అలానే రైతులు, గ్రామీణుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సచివాలయాలు ద్వారా పొందేవారు. సంక్షేమ పథకాలు అందజేయ డంలోనూ ఈ వ్యవస్థ క్రియాశీలకంగా వ్యవహరించింది.

కూటమి పాలనలో సచివాలయాలకు..

వైఎస్ జగన్ ప్రభుత్వంలో మహర్దశ పొందిన సచివాలయాలకు 2024 ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చిన్నచూపునకు గురయ్యాయి. ప్రజలకు 139రకాల సేవలను అందించే సచివాలయాల్లో 75శాతం పైగా సేవలను కూటమి ప్రభుత్వం దూరం చేసింది. దీంతో ఏ పథకానికి పేర్లు నమోదు చేసుకోవాలన్న మీ–సేవా కేంద్రాలకు లబ్ధిదారులు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు రైతులకు గత ప్రభుత్వం చెల్లిస్తూ వచ్చిన పంట బీమా పథకం ప్రీమియంను తీసివేసింది. దీంతో రైతులే పంటల బీమా ప్రీమియంను చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. పైగా వీటిని నమోదు చేసుకునేందుకు మీ–సేవా కేంద్రాల బాట పట్టాల్సి వస్తోంది. జగన్ ప్రభుత్వం ఇంటికే వచ్చి వలంటీర్లు సంక్షేమ పథకాలకు పేర్లు నమోదు చేసుకొని లబ్ధి చూకూర్చే వారని, కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం పింఛన్లకు, రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకుందామని సచివాలయాలకు వెళ్లితే సర్వర్ పనిచేయడం లేదని చెబుతుండటంతో లబ్ధిదారులు ఏమీ చేయలేని పరిస్థితుల్లో వెనక్కి వెళుతున్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందాయి. ఇందులో ప్రధాన భూమిక పోషించింది. వలంటీర్లే అని చెప్పాలి. ఏ పథకమైన ప్రతి అర్హుడికి అందాలనే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా వలంటీర్లు పనిచేశారు. అలానే కరోనా కష్టకాలంలో వీరు చేసిన సేవలు వెలకట్టలేనివి. కాగా గతంలో చంద్రబాబు వలంటీర్ల వ్యవస్థపై నోరుపారేసుకున్నప్పటికీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్ల వ్యవస్థను కొనసాగించి వారికి గౌరవ వేతనాన్ని రూ.10వేలకు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక వలంటీర్ల వ్యవస్థ అనేది లేదని, వాటిని కొనసాగించడం అనే ప్రశ్న ఉత్పన్నం కాదని అసెంబ్లీ సాక్షిగా తన మంత్రుల ద్వారా తెలియజేసి, వలంటీర్లను వెన్నుపోటు పొడిచాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు కావొస్తున్న వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వలంటీర్లు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నప్పటికీ తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటం వలంటీర్లను ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. కాగా మండలంలో గ్రామ సచివాలయాల సంఖ్య 20, సచివాలలోని ఉద్యోగస్తులు 150 మంది, మండలంలో సచివాలయాలో వంటీర్లు 258 మంది పనిచేస్తున్నారు.

సచివాలయాల్లో సేవలు కొనసాగించాలి



సచివాలయాలు లేక ముందు చిన్న సర్టిఫికేట్ కావాలన్న మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయాల్లోనే చాలా వరకు ప్రభుత్వ సేవలను అందుకున్నాం. ప్రస్తుతం ఏ చిన్న పని కావాలన్న మరి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాని సచివాలయ సిబ్బంది తెలియజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయాల్లోనే గతంలో అందే సేవలను అందించాలని కోరుతున్నాం.

– దేవరశెట్టి రాంబాబు, కొండేపాడు, రైతు

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో వలంటీర్లను యథావిధిగా కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.5వేలు నుంచి రూ.10వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు పూర్తయినా ఇంతవరకు వలంటీర్లు గురించి ఎటువంటి హామిని ఇవ్వలేదు. తక్షణమే మాలాంటి వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుకుంటున్నాను.

– పి. ప్రకాష్, వలంటీర్, ప్రత్తిపాడు

క్లుప్తంగా

కనకదుర్గమ్మ ఆలయానికి విరాళం



వద్ది రఘురాంనాయుడుకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయానికి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వద్ది రఘురాం నాయుడు రూ.20వేలు విరాళాన్ని అందజేశారు. తొలుత ఆయనకు ఆలయ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరు కావాలంటూ ఆహ్వాన పత్రాన్ని ఆలయ కమిటీ వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, నాయకులు మాకరాజు సతీష్, కొండుబోయిన కృపావరం తదితరులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి



నీలాద్రిపురం గ్రామంలో కోకో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: కోకో ధరల విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డాక్టర్ నబీర్ రసూల్, వారి బృందం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల అనుభవాలు, ధరల విషయంలోఎదుర్కొంటున్న ఇబ్బందులపై మాట్లాడారు. జిల్లా ఉద్యాన అధికారి దేవానంద్ మాట్లాడుతూ కోకో నాణ్యతకు సోలార్ డ్రయర్స్, ఉత్పత్తులైన కోకో పౌడర్, బటర్ వంటి చిన్న కుటీర పరిశ్రమలకు రైతులు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి శ్రీలక్ష్మి, ఉద్యాన సహాయకులు వంశీ, సాయి, రాజు, వీర్రాజు, కొమ్ముగూడెం, వీరంపాలెం, కడియద్ద, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి



దివ్యాంగుల సేవా కార్యక్రమంలో లయన్స్ డాక్టర్ కమల, పేరిచర్ల మురళీకృష్ణంరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులకు ఎల్లప్పుడు తమ వంతు సహాయ సహకారాలు, వారికి ఉచిత వైద్య సదుపాయాలు తప్పక ఉంటాయని లయన్స్ డాక్టర్ కమల అన్నారు. భవిత కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్, పేరిచర్ల ఫౌండేషన్ అధినేత మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక దివ్యాంగుల కేంద్రంలో దివ్యాంగులకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దివ్యాంగులకు స్నాక్స్, నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులను నార్మల్ పిల్లలతో సమానంగా చూడాలని, దివ్యాంగుల పిల్లలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవిత ప్రత్యేక ఉపాధ్యాయులు బాలీశ్వరయ్య, భవిత సెంటర్ ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు విద్యపై మక్కువ పెంచుకోవాలి



మాధవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

తాడేపల్లిగూడెం రూరల్: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, బాలికలు విద్యపై మక్కువ పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. బేటీ బచావో. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కృష్ణాయపాలెం, మాధవరం, జగన్నాథపురం గ్రామాల్లో విద్య ఆవశ్యకత, వివాహ వయస్సు, వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్.చంద్రావతి, వి.కనకమహాలక్ష్మి, యు. ఊదాలమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పెంటపాడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీవో సరస్వతీ తెలిపారు. మంగళవారం పెంటపాడు పోస్టుబేసిక్ స్కూల్లో బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో కలిసి ఐసీడీఎస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దుర్గాభవానీ, సుజాత, జీజీబీ విజయలక్ష్మి, పాల్గొన్నారు.

చురుగ్గా రావిపాడు చెరువు పనులు



రావిపాడులో తాగునీటి చెరువు పూడిక తొలగిస్తున్న దృశ్యం

పెంటపాడు: వచ్చే వేసవిలోగా గ్రామంలో పూర్తిగా స్వచ్ఛమైన తాగునీరు అందజేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు సర్పంచ్ పెన్నాడ సూరిబాబు పేర్కొన్నారు. గత నెల రోజులుగా గ్రామంలోని భారీ తాగునీటి చెరువు పూడికతీత పనులు, ఉపాధి హామీ ద్వారా పైపులైన్లు పనులు మండల అధికారుల సూచనల మేరకు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను కార్యదర్శి శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు.

సామాన్యులపై బడ్జెట్ భారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సామాన్యులపై భారం మోపి, సంపన్నులపై వరాలు కురిపించిందని, అలాగే అరకొర నిధులతో వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ నిధులు భారీగా కనబడినప్పటికి, కార్పొరేట్లు ప్రయోజనాలు కాపాడే విధంగాను, రైతాంగం, పేద ప్రజలపై భారాలు, నిధులు కేటాయింపునకు కోతలు విధించినట్లు చెప్పారు. రూ 50 లక్షల 65 వేల కోట్లుతో ప్రకటించిన బడ్జెట్ వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపు విషయంలో నిర్లక్ష్యం చేసినట్లు తెలిపారు. ఈ బడ్జెట్ రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని గుర్తించలేదని విమర్శించారు. విభజన చట్ట ప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యా సంస్థలకు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. రాష్ట్రానికి పూర్తిగా తీరని ద్రోహం చేశారని విమర్శించారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



నన్నయ్య ప్రాంగణంలో క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ టి.అశోక్



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం: క్యాన్సర్ గురించి ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని నన్నయ్య ప్రాంగణం ప్రిన్సిపాల్ టి.అశోక్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం క్యాంపస్‌లో అవగాహన కార్యక్రమం జరిగింది. సమతుల ఆహారం, ఆరోగ్యకరమైన అలవాట్లు, క్రమమైన శారీరక శ్రమ ఉంటే కొన్ని వ్యాధులను దరిచేరకుండా చూసుకోవచ్చన్నారు. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం, నివారణల గురించి డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ కెవిఎస్.ఎన్.రాజులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): క్యాన్సర్ పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ టీఎల్ సరస్వతి అన్నారు. స్థానిక బీబీ సెంటర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఐసీడీఎస్, హెల్త్ సిబ్బంది తదితరులచే హెల్త్ కన్వర్జెన్స్ సమావేశం జరిగింది. మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ శ్రావ్య, వన్యసిరిలు సమావేశంలో క్యాన్సర్ ఎలా గుర్తించాలి, గుర్తించిన వారిని ఎక్కడకి పంపాలి, లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని పలు విషయాలపై హెల్త్ సిబ్బందికి, అంగన్‌వాడీలకు, ఆశాలకు అవగాహన కల్పించారు. అనంతరం క్యాన్సర్ వ్యాధి పై అప్రమత్తంగా ఉండాలని ర్యాలీ నిర్వహించారు. ముందస్తు పరీక్షలు క్యాన్సర్ నుంచి రక్ష, క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యమని, తదితర నినాదాలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ కే.దుర్గా భవానీ, హెల్త్ సూపర్‌వైజర్లు మంగతాయారు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ మందిరంలో విశేష పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాఘ శుద్ధ సప్తమి (రథసప్తమి) సందర్భంగా మంగళవారం స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో నిత్య పూజలు అనంతరం శ్రీ సూర్యనారాయణ స్వామికి అష్టోత్తర పూజలు, తదుపరి నీరాజన, మంత్ర పుష్పాలు సమర్పించారు. నివేదనలు అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. సూర్యాష్టకం , ఆదిత్య హృదయం, హనుమాన్ చాలీసాలు పారాయణం చేశారు. మందిర అధ్యక్షుడు కొర్లేపర పాంగు రంగారావు, కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజులు పర్యవేక్షించారు. భక్తులు పాల్గొన్నారు.

శ్రీవాసవి ఆలయంలో..

శ్రీవాసవి ఆలయంలో రథ సప్తమి సందర్భంగా సూర్యనారాయణ స్వామికి మంగళవారం కల్యాణోత్సవం, శాంతి కల్యాణం జరిగింది. మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో, ఫలరసాలతో అభిషేకాలు జరిగాయి. ఆర్య వైశ్య సంఘం సెక్రటరీ నున్న బాలా త్రిపుర సుందరరావు, సెక్రటరీ ఆలపాటి సత్యనారాయణలు పర్యవేక్షించారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



సాంప్రదాయ సిద్ధంగా పొంగలి తయారు చేస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో వనువులమ్మ, మారెమ్మ, పోతురాజు స్వామి ఆలయంలో మంగళవారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయసిద్ధంగా పొంగలి తయారు చేసి, అమ్మవార్ల, పోతురాజు స్వామికి నివేదించారు. బండి శ్రీనివాస్ – ధనలక్ష్మి, ఆలపాటి అనిల్‌కుమార్ – లీల ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు నిర్వహించారు. రాధాకృష్ణ భజన సమాజం పరిమి స్వరాజ్యం, ఆలపాటి శ్రీదేవి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వీరంపాలెం, ముత్యాలంబాపురం, పెదతాడేపల్లి, కృష్ణాయపాలెం, నందమూరు, మాధవరం తదితర గ్రామాల్లోని శ్రీవేంకటేశ్వర స్వామి, అమ్మవార్ల ఆలయాల్లోనూ రథసప్తమి వేడుకలు నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఇరగవరంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఇరగవరం: మండలంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. మంగళవారం ఇరగవరం మండలం కావలిపురం గ్రామంలో మెయిన్ సెంటర్ వద్ద ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 30మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులను పరిశీలించి ఉచితంగా మందులను అందజేశారు. పలు ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ పరమహంస హోమియోపతి ఆసుపత్రి, ప్రముఖ హోమియోపతి వైద్య నిపుణులు డాక్టర్ కోసూరి రామకృష్ణానంద రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత ఆదిత్యుడు



అత్తిలి: బల్లిపాడు స్కూల్‌లో యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

అత్తిలి: ప్రపంచంలో ఎన్ని మతాలు ఉన్నప్పటికీ అన్ని మతాల వారికి ప్రత్యక్షదైవం సూర్యభగవానుడు మాత్రమేనని పాఠశాల డైరెక్టర్ తిరుపతి శ్రీనివాస్ అన్నారు. రథసప్తమి వేడుకను మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడు శ్రీమదనగోపాల్ స్కూల్‌లో ఘనంగా జరిపారు. ఈసందర్భంగా ప్రత్యక్ష దైవం సూర్యనారాయణమూర్తికి పూజాదికాలను నిర్వహించారు. అనంతరం యోగా గురువు బండి శ్రీనివాస ప్రసాద్ విద్యార్థులకు సూర్య నమస్కారాలు, యోగాసనాలు నేర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు క్రమం తప్పకుండా సూర్యనమస్కారాలు, యోగాసనాలు చేయడం ద్వారా అనేక రకాల అనారోగ్య సమస్యలను అధికమించవచ్చన్నారు. యోగా గురువు శ్రీనివాస్ ప్రసాద్‌ను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అనిత, వైస్ ప్రిన్సిపాల్ గీతా భారతి, ప్రధానోపాధ్యాయుడు బాడిగ నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జ్ ఆకుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): రథసప్తమి సందర్భంగా మాగంటి కల్యాణ మండపంలో మంగళవారం సూర్య నమస్కారాల పోటీలు జరిగాయి. వివిధ పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. యోగాచార్యులు ఇంజమూరి మాధవరావు మాట్లాడుతూ సూర్యుడులోని అనంతమైన శక్తిని గ్రహించడానికి మహర్షులు ఈ సూర్య నమస్కారాలు మనకు అందజేశారని చెప్పారు. ప్రతి రోజు 10 నిమిషాలు సూర్య నమస్కారాలు చేస్తే సంపూర్ణ ఆరోగ్యంతో పాటుగా మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సూర్య నమస్కారాలు చేయాలని, ప్రతి రోజు యోగ చేయడం ద్వారా మంచి ఆరోగ్యం సొంతమవుతుందని చెప్పారు. పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. గ్రంధి సత్యనారాయణ, బొలిశెట్టి రాజేష్, తిరుమల్ల సూరిబాబు, కడియాల పరశురాం, యోగా గురువులు కరిబండి రామకృష్ణ, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, యోగా సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీమా రంగంలో ప్రస్తుతం ఉన్న విదేశీ పెట్టుబడుల పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రానున్న రోజుల్లో సమ్మెకు వెనకడామని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తు స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద మంగళవారం పెద్ద ఎత్తున ఉద్యోగులు నిరసన తెలిపి, నినాదాలు చేశారు. ఉద్యోగుల సంఘం కార్యదర్శి సొలస సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కారణంగా పూర్తిగా విదేశీ నిధులతో బీమా సంస్థలను ఏర్పాటు చేస్తారని, తద్వారా విదేశీ సంస్థల ఆధిపత్యంలోకి బీమా రంగం వెళ్లుతుందన్నారు. దీంతో ప్రజల సొమ్ములకు భద్రత కరువు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయిన వెంటనే సమ్మెలో పాల్గొంటామని హెచ్చరించారు. సమావేశంలో అధ్యక్షుడు తోట పద్మారావు, అంజికుమార్, రమేష్, మహంకాళి, కిషోర్, నాగేంద్ర, శాంతి, ఎల్ఐసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దాతల ఔదార్యం అభినందనీయం

తణుకు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్న దాతల ఔదార్యం అభినందనీయమని మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్.మోహన్‌బాబు అన్నారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలకు గ్రామానికి చెందిన ఆత్మకూరి రామకృష్ణ, ఐడీబీఐ రావులపాలెం బ్రాంచ్ మేనేజర్ చుండ్రు రమేష్ చొరవతో మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.75 వేలతో 15 సీలింగ్ ఫ్యాన్లు, 25 కుర్చీలు, 5 కంప్యూటర్ టేబుల్స్ ఐడీబీఐ పాలంగి బ్రాంచ్ ఆధ్వర్యంలో బహూకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడీబీఐ పాలంగి బ్రాంచ్ మేనేజర్ ఎన్. కార్తీక్, ఫీల్డ్ ఆఫీసర్ కె. కోటేశ్వరరావు, నీటిసంఘం అధ్యక్షుడు వై.యల్లపరాజు, పాఠశాల ఉపాధ్యాయులు సంకు సూర్యనారాయణ, జి. భారతి, షేక్ షర్మిల, ఏ.మాణిక్యాంబ, పి. పద్మావతి, కె. కామేశ్వరరావు, జి. గోపాలకృష్ణ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మిక చట్టాలను తప్పక అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, నాయకులు చిర్ల పుల్లారెడ్డిలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అపరాలు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) 39వ వార్షికోత్సవం స్థానిక చుక్కా అప్పలస్వామి భవనం వద్ద గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సీనియర్ నాయకులు ద్వారంపూడి అప్పిరెడ్డి సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా కరెడ్ల రామకృష్ణ ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా చిటికిన రాము, ఉపాధ్యక్షుడిగా అయినాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అడపా లోవ, కోశాధికారి యడ్ల శ్రీను, కమిటీ సభ్యులు దాసరిరాజు, సుందరపు అప్పలనాయుడు, వెదుళ్ళ రమణారావు, ఇల్ల గోవిందరావు, బద్ది నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

వడ్డీ లేని రుణాలను ఆటో కార్మికులకు అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునిస్వామి

ఇరగవరం: బ్యాంక్ నుంచి వడ్డీ లేని రుణాలు ఆటో కార్మికులకు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేలంగి గ్రామంలో మంగళవారం ఆటో యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. కామన మునిస్వామి మాట్లాడుతూ ఆటోలను నడుపుతూ 5 లక్షల మంది రాష్ట్రంలో జీవిస్తున్నారని, అటువంటి వారిని ప్రభుత్వం ఆదుకోవడం లేదని విమర్శించారు. ఫైనాన్స్ కంపెనీలు వద్ద అధిక వడ్డీలకు ఆటోలను కొనుగోలు చేస్తూ, వడ్డీలు కట్టలేక పస్తులతో కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులను చిన్నచూపు చూడవద్దని, స్పేర్ పార్ట్స్ ధరలు తగ్గించాలని, ఇన్సూరెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.